# అసలు సంగతి

-ప్రతాప వెంకట సుబ్బారాయుడు

అభిరామ్ ఆఫీసు పనిమీద సికింద్రాబాదు రైల్వేస్టేషనులో దిగాడు. ఇలా రావడం అతనికి మామూలే! అక్కడున్న బెంచిమీద అరగంట వెయిట్ చేశాడు, తనకోసం ఎవరన్నా వస్తారేమోనని. రాకపోయేసరికి కాస్త విసుగ్గా టైము చూసుకున్నాడు. "అబ్బా ఏడున్నర" తను ఆ ఆఫీసులో తొమ్మిదింటికల్లా వుండాలి. అలా అయితేనే పని పూర్తిచేసుకుని రాత్రికి బండెక్క గలుగుతాడు. గబగబా స్టేషన్ బైటకొచ్చి ఆటో మాట్లాడుకుని ఆఫీసుకి దగ్గరగా వున్న లాడ్జికి వెళ్ళాడు. రూమ్ బుక్ చేసుకున్న తర్వాత అతనికి అసలు విషయం గుర్తుకొచ్చింది. అదేమిటంటే తను సికింద్రాబాదు రైల్వేస్టేషనులో సూట్‌కేస్ మర్చిపోయాడు.

అతని పైప్రాణాలు పైనే పోయాయి. దానిలో చాలా ఇంపార్టెంట్ డాక్యుమెంట్లు వున్నాయి. అంతేకాకుండా కొంత కరెన్సీ..క్రెడిట్ కార్డులు కూడా వున్నాయి. "అయిపోయింది. అంతా అయిపోయింది. తన ఉద్యోగం ఊడిపోవడం ఖాయం" ముచ్చెమటలతో బయటికి పరుగులు తీస్తున్న అభిరామ్‌ని హోటల్‌స్టాఫ్ అయోమయంగా చూశారు.




బయటికి వచ్చిన అభిరామ్ తనని తీసుకువచ్చిన ఆటో అక్కడే వుండడంతో దాన్లోకెక్కి 'స్టేషన్‌కి పోనియ్' అన్నాడు. డ్రైవర్ అతన్ని ఎగాదిగా చూసి ఆటో స్టార్ట్ చేసి ముందుకుపోనిచ్చాడు.

తన పిచ్చిగాని బెంచిమీద వదిలిన నిక్షేపంలాంటి కొత్త బ్రీఫ్‌కేసు ఎవరన్నా తీసుకోకుండా వుంటారా? ఈపాటికి ఎవరో తీసుకెళ్లే వుంటారు. ఏ దొంగ పుణ్యం కట్టుకున్నాడో?

పోనీ ఎవడు తీసుకున్నా దాన్లో వున్న డబ్బు తీసుకుని, దాన్నక్కడ వదిలేసినా కనీసం ఉద్యోగమన్నా నిలబడుతుంది. లేదంటే ఎంక్వయిరీలు, సస్పెన్షన్‌లు, చివరికి ఉద్యోగం పోతుంది. అభిరామ్ గుండె రాజధాని ఎక్స్‌ప్రెస్ స్పీడ్‌తో కొట్టుకుంటోంది.

ఆటో స్టేషన్ ముందాగింది. అంతే చెంగున దూకి రివ్వున స్టేషన్‌లోకి పరిగెత్తాడు. అతను ఇందాక దిగింది చివరి ప్లాట్‌ఫాం! మెట్లెక్కి బ్రిడ్జిమీదుగా పరిగెత్తి చివరి ప్లాట్‌ఫాం కెళ్ళి తను అప్పుడు కూర్చున్న బెంచి దగ్గరకి అదిరే గుండెలతో వెళ్ళాడు. చూడాలంటే భయం..చూడకుండా వుండలేని టెన్షన్. వెంకన్నబాబుకి మొక్కుకుని చూశాడు.

ఆశ్చర్యం, అతని సూట్‌కేస్ భద్రంగా అక్కడే వుంది. దాన్ని ఆత్రుతగా ఆప్యాయంగా తడిమాడు. అతని గుండె ఇంకా కొట్టుకుంటోంది. అతని కళ్ళ వెంట ఆనందబాష్పాలు. అతనికి కలా నిజమా అన్నది అర్థం కావడం లేదు. అతను చుట్టూ చూశాడు. అన్ని బెంచీలమీద జనం. కానీ ఈ బెంచిమీద మాత్రం ఎవరూ లేరు. ఎందుకో అర్థం కాలేదు.

అంతలో కొంతమంది సి.ఆర్.పి.ఎఫ్. పోలీసులతో అక్కడికి వచ్చారు. వాళ్ళు అభిరామ్‌ని, అతని చేతిలో సూట్‌కేస్‌ని భయంగా చూస్తున్నారు. పోలీసులు కాస్త దూరంగా నుంచుని "ఏయ్ మిస్టర్! దాన్ని కిందపెట్టు. చాలాసేపట్నించి అదిక్కడ వుందిట. మరోక్షణంలో బాంబు స్క్వాడ్ వస్తుంది. దాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తుంది" అన్నారు.

అభిరామ్‌కి అప్పుడు అర్థమయింది. 'బాంబు బూచివల్ల తన సూట్‌కేస్ భద్రంగా వుంది. లేకపోతే ఈపాటికి మరొకరి హస్తగతమయివుండేది. భయంతో దీన్ని అందరూ జాగ్రత్తగా కనిపెట్టుకు వున్నారన్నమాట!' అనుకుని పోలీసులకి తన ఐడెంటిటీని చూపించుకుని, సూట్‌కేస్‌లోని వస్తువులు చెప్పి తీసి చూపించి, అది తనదే అని ప్రూవ్ చేసుకుని ప్రశాంతంగా బైటపడ్డాడు. మళ్లీ అదే ఆటోఎక్కి "లాడ్జికి పోనియ్" అన్నాడు.

★